## క్లుప్తంగా

### పొట్టులారీలతో ప్రమాదాలు



ఇరువైపులా నింపిన పొట్టుతో వెళ్తున్న డీసీఎం

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న పొట్టులారీలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తూప్రాన్ – నర్సాపూర్ హైవే గుండా నిత్యం పొట్టు వాహనాలు వెళ్తుడడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీలు, డీసీఎంల బాడీ కన్నా అదనంగా ఇరువైపుల పొట్టు నింపి రవాణా చేస్తుండడం వల్ల ఇతర వాహనాలకు సైడ్ దొరకని పరిస్థితి నెలకొంది. వీటితో జరుగుతున్న ఇబ్బందులు, ప్రమాదాల గురించి పలువురు వాహనదారులు వాట్సాప్ గ్రూపుల్లో సైతం పోస్టులు పెడుతున్నారు. సంబంధిత రవాణా శాఖ ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### గ్రామ పరిశుభ్రతే లక్ష్యం



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న యువత

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ పరిశుభ్రతే లక్ష్యమంటూ యువత వారవారంలో భాగంగా గ్రామంలో స్వచ్ఛాభారత్ నిర్వహిస్తూ పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు కూచారం యువత. మండంలోని కూచారం గ్రామానికి చెందిన నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు ప్రతి ఆదివారం స్వచ్ఛభారత్ చేపట్టి 294వ వారం హరితవనంలో పలు చెట్ల వద్ద పాదులను శుభ్రం చేశారు. వనంలో చెత్త చెదారాన్ని తొలగించి డంప్‌యార్డ్‌కు తరలించారు. అనంతరం మొక్కలకు నీరు పట్టారు.

### పగలు వెలుగుతున్న లైట్లు



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని పలు కాలనీల్లో వీధిలైట్లు పగలు సైతం వెలుగుతున్నాయి. గ్రామంలోని పల్లెగడ్డ, కొత్తకాలనీ, ఎంపీడీఓ కార్యాలయం ఆవరణతో పాటు మినీ ట్యాంక్‌బండ్ తదితర చోట్ల వీధిలైట్లు పగటిపూట వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతుందని అధికారులు స్పందించి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### నేడు దీపోత్సవం



చండిలో కొలువైన చండికాంబ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో కొలువైన ఆలయాల్లో కార్తీకమాసం చివరి సోమవారం దీపోత్సవం నిర్వహించనున్నారు. శివ్వంపేటలోని ఉమా మహేశ్వరస్వామి ఆలయం, చండి గ్రామంలో కొలువైన చండికాంబ ఆలయం, చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయాల వద్ద సోమవారం దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### ప్రమాదకరంగా గుంత



సీసీ రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని రామాయిపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం సమీపంలోని నివాస గృహాల వద్ద సీసీ రోడ్డు ధ్వంసమైంది. డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లకపోవడంతో కొందరు రోడ్డును గతంలో ధ్వంసం చేశారు. దీంతో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో రాత్రి సమయాల్లో గుంత కనబడక వృద్ధులు, చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతను పూడ్చివేయాలని కోరుతున్నారు.

# ఆలయాల్లో కార్తీక పూజలు



చాముండేశ్వరి ఆలయంలో భక్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్తీక మాసంలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవికి పూజలు చేస్తున్న భక్తులు

### నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు వాహనాలకు పూజలు చేయించడంతో పాటు తలనీలాలు సమర్పించారు. ఆలయం వద్ద డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు వెంకట్‌రెడ్డి, ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు.

# వైభవంగా మహాపడి పూజోత్సవం

**మారుమోగిన అయ్యప్ప నామస్మరణ**

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన కోల్కూరి వెంకట్రామ్‌రెడ్డి 18వ మహాపడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప దాసన్ సంతోష్ గురుస్వామి ఆధ్వర్యంలో 18 మెట్లకు దీపారాధన చేసి, అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వాములు అయ్యప్ప పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. చిన్నశంకరంపేటకు చెందిన గురుస్వాములు సిద్ధిరాములుగౌడ్, చంద్రయ్య, రమేశ్‌గౌడ్, రంగారావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, జెడ్పీటీసీ పట్లోరి మాధవిరాజు, మాజీ జెడ్పీటీసీ పోతరాజ్ రమణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీమాన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పట్లోరి రాజు, కుమార్‌గౌడ్, బందారు స్వామి, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహాపడి వెలిగిస్తున్న గురుస్వామి వెంకట్రామ్‌రెడ్డి

# భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలో గ్రామ దేవతల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఆదివారం గ్రామంలో కొలువైన దేవతలకు, బొడ్రాయికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు ఊరడమ్మకు గావురంగం, ఊరిపొత్తి నిర్వహించారు. సోమవారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడంతో పాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కీర్తనహన్మంత్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఉప సర్పంచ్ పాండురంగం, గ్రామ పెద్దలు జైపాల్‌రెడ్డి, ముత్యాలు, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, సునందరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కల్లూరి రాజు, యాదిరెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

### పరామర్శ



నవీన్‌ను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న రఘునందన్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ఆదివారం దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా నార్సింగి మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుమ్మరి నవీన్‌ను పరామర్శించారు. అలాగే సూతారి లక్ష్మణచారి సోదరి మెదక్ ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు కోసం వెళ్లి మృతి చెందింది. దీంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు శిర్న చంద్రశేఖర్, కుమ్మరి నర్సింలు, లింగారెడ్డి, సిద్ధు, మరిబాబు, శేఖర్‌రెడ్డి, మహబూబ్, సత్యం, నియంత్‌రెడ్డి, సాయి ఉన్నారు.

### నేడు నార్సింగి ఎంపీపీ సర్వసభ్య సమావేశం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆనందమేరి తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సబిత అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

### నేడు కోనాపూర్‌లో గణపతి ఆలయ వార్షికోత్సవం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కోనాపూర్‌లో కొలువైన గణపతి సహిత ఆంజనేయ స్వామి ఆలయ 14వ వార్షికోత్సవాలు సోమవారం జరగనున్నాయి. వార్షికోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి హాజరై కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

### ప్రతిభ చాటిన విద్యార్థులు



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): కుంగ్‌ఫూ కరాటే సౌత్ ఇండియా చాంపియన్స్‌గా మండలంలోని మిర్జాపల్లి జెడ్పీపాఠశాల విద్యార్థులు నిలిచారు. ఆదివారం హైదారాబాద్‌లోని శంషాబాద్‌లో జరిగిన కుంగ్‌ఫూ కరాటే చాంపియన్ 2023 పోటీల్లో ముగ్గురు విద్యార్థులు వరుసగా ప్రథమ స్థానంలో అంజలి పాండే, ద్వితీయ స్థానంలో ప్రసన్న, తృతియ స్థానంలో రేణుక నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను, కరాటే మాస్టర్ కిషన్‌స్వామిలను మిర్జాపల్లి జెడ్పీపాఠశాల హెచ్‌ఎం పుష్పవేణి అభినందించారు. అలాగే మరో విభాగంలో మిర్జాపల్లి జెడ్పీపాఠశాలకు చెందిన కృతిక, లక్షిత ద్వితియ, తృతియ స్థానాల్లో నిలిచనట్లు హెచ్‌ఎం తెలిపారు.

### సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామానికి చెందిన దస్తగిరి, యాదయ్యకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 45 వేల చెక్కులను ఆదివారం అందజేశారు.

# ఆటో డ్రైవర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

**15 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్**

శివ్వంపేట(నర్సాపూర్): ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టడం వల్ల తమ జీవనోపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్లు ఆదివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. తూప్రాన్ – నర్సాపూర్ ప్రధాన రహదారి శివ్వంపేట బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ.. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల ఆటోల్లో ఎవరు ఎక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా జీవనోపాధి కోల్పోయినందుకు ప్రభుత్వం తమకు నెలకు రూ.15 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఆంజనేయులుగౌడ్, అనీల్, రమేశ్‌గౌడ్, ప్రభాకర్‌నాయక్, చాన్‌పాషా, ఇబ్రహీం, ప్రశాంత్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

# మంత్రులను కలిసిన శ్రవణ్‌కుమార్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన పలువురు మంత్రులను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో మంత్రులుగా బాధ్యతలను స్వీకరించిన కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులను కలిసి సన్మానించినట్లు తెలిపారు. ప్రజలకు మరింత చేరువ కావడానికి ప్రభుత్వం తరఫున చేయాల్సిన పనులను గురించి వివరించినట్లు శ్రవణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో మాజీ మండల శాఖ అధ్యక్షుడు పెంటారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నట్లు తెలిపారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో శ్రవణ్‌కుమార్‌రెడ్డి

# భక్తితోనే మానసిక ప్రశాంతత సాధ్యం

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి**

చిలప్‌చెడ్(నర్సాపూర్): అన్ని సేవల్లో భగవంతుడి సేవ గొప్పదని, భక్తి మార్గంలో ఉన్న ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత ఉంటుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గంగారంలో గ్రామంలో ప్రార్థనాలయానికి సంబంధించిన ఓ గృహం ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఫాస్టరేట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మమత, ఎంపీపీ వినోదరెడ్డి, మాజీ సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, విజయమ్మ, పాస్టర్‌లు సంజీవ్, రవీందర్, ప్రవీణ్, నాయకులు ఆశోక్‌రెడ్డి, దుర్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**సునీతారెడ్డిని కలిసిన టమాటా రైతు**

కౌడిపల్లి(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిని టమాటా రైతు మహిపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డితోపాటు మహ్మద్‌నగర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో సునీతారెడ్డి ఇంట్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సునీతారెడ్డితో మహ్మద్‌నగర్ గ్రామస్తులు

# ఘనంగా సరస్వతీ మహాయజ్ఞం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం చిన్నశంకరంపేటలో సరస్వతీ మహాయజ్ఞం చేశారు. ఆదివారం ఈ సందర్భంగా అమ్మవారి అభిషేకం, కుంమార్చన, హోమం, పూర్ణాహుతి, నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి క్షేత్రం, సరస్వతీ యాజ్ఞ అధిపతి అష్టకాల విద్య మనోహర శర్మ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరిలో భక్తిభావం పెరగాలని కోరారు. భక్తిభావంతో సేవాభావం, దానగుణం ప్రతీ ఒక్కరు పెపొందించుకోవాలని కోరారు. అమ్మవారి క్షేత్రంలో 30 ఏళ్లుగా అష్టకాల నరసింహరామశర్మ దివ్యాశీస్సులతో ఇప్పటికి 484 యాజ్ఞాలు పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అష్టకాల విద్యాసాగర్ శర్మ, విద్యచరణ్‌శర్మ, నాగరాజశర్మ, శ్రీధర్‌శర్మ, సమితి సభ్యులు శ్రీనివాస్, నరేందర్, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జెడ్పీటీసీ మాధవిరాజు, సర్పంచ్‌లు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదవరావు, శ్రీమాన్‌రెడ్డి, చేగుంట ఎంపీటీసీ వెంకటలక్ష్మి, యజ్ఞ సమితి సభ్యులు రాచర్ల రాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



యజ్ఞం చేస్తున్న భక్తులు

# శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయం దుస్థితి



రికార్డులు భద్రపరచిన గది

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయంలోని గదులన్నీ బీటలు వారింది. పై కప్పు పెచ్చులూడి పడుతున్నాయి. వర్షాకాలంలో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పైకప్పు నుంచి నీటి చుక్కలు పడుతుండడం, గోడలు నిమ్మెక్కి కార్యాలయంలోని రికార్డులు, విలువైన పరికరాలు భద్రపరిచేందుకు సిబ్బంది నానా తాటాలు పడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లోనే 2013 లో రూ.60 లక్షలు వెచ్చించి నూతన భవన నిర్మాణాన్ని చేపట్టారు. పనులను చేపట్టిన గుత్తేదార్ స్లాబ్ గోడల వరకు నిర్మించి నిధుల లేని కారణంగా పనులను నిలిపివేశాడు. నాటి నుంచి ఇప్పటివరకు నూతన భవనం నిర్మాణానికి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పెట్టినా.. ఇప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో అది కాస్త అలంకారప్రాయంగా తయారైంది. ప్రస్తుత ప్రభుత్వం అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసి, నూతన భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# రసాయన ఎరువుల వాడకం తగ్గించండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నర్సాపూర్‌రూరల్: రైతులు పొలాల్లో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని కేవీకే శాస్త్రవేత్తలు అన్నారు. ఆదివారం మండలంలోని సీతారాంపూర్‌లో రైతులకు సేంద్రియ ఎరువులపై కౌడిపల్లి మండలం తునికి వద్ద డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస పౌండేషన్(కేవికే) కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త మల్లారెడ్డితో పాటు విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమిలో తగ్గిపోతున్న సారాన్ని కాపాడినప్పుడే మంచి దిగుబడితో పాటు పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. అజోల్లా సాగు, తయారీ, ఉత్పత్తి, జాగ్రత్తలు, ఉపయోగాలు వివరించారు. అజొల్లా అంటే నీటి మీద తేలుతూ పెరిగే నాచులాంటిదని, పంట సాగులో పచ్చిరొట్టగా జీవన ఎరువుగా ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవికే విద్యార్థులు దేవిశ్రీప్రసాద్, అనుష్కరావు, ద్రిష్టి పాటిల్, బ్రింద, నితిషా, సంజన తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు



పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు



ప్రమాదకరంగా తీగలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని నెల్లూర్ గ్రామ శివారుల్లోని పంట పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. వ్యవసాయ కనెక్షన్ల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు పక్కకు వాలాయి. దీంతో విద్యుత్ తీగలు భూమికి అతి సమీపంలోకి వచ్చాయి. మనిషి నిలబడితే మనిషికి తాకేలా ఉన్నాయి. ఆదమరిచి పనిలో నిమగ్నమైతే విద్యుత్ ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. వారు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో ఏదేని ప్రమాదం జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.